విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

యువత జీవన ప్రమాణాలపై అధ్యయనం

విశాలాంధ్ర-ఘంటసాల: భారతదేశంలోని యువతీ యువకుల, జీవన ప్రమాణాల పై జర్మనీ దేశస్తులు గత వారం రోజులుగా అధ్యయనం చేస్తున్నారని ఆర్థిక సమతామండి ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్ సత్యనారాయణ సోమవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా పిడి సత్యనారాయణ మాట్లాడుతూ జర్మనీ దేశస్థులు గత వారం రోజుల నుండి భారతదేశం లోని వివిధ రాష్ట్రాల్లో యువతీ యువకుల జీవన ప్రమాణాలు ఏ విధంగా ఉన్నాయో, అధ్యయనం చేస్తున్నారని, దీనిలోని భాగంగానే ఘంటసాల లో ప్రసిద్ధిగాంచిన బౌద్ధ స్తూపాన్ని ఆర్థిక సమతా మండలి ఆధ్వర్యంలో సందర్శించడం జరిగిందన్నారు. వీరికి మాజీ జడ్పీ ఉపాధ్యక్షులు గొర్రెపాటి వెంకట రామకృష్ణ బౌద్ధ స్తూపం యొక్క ఆవశ్యకతను, బుద్ధుడు ప్రబోధించిన సూక్తులను, బౌద్ధం ఈ ప్రాంతంలో ఎలా విరాజిల్లింది అనేది కూలంకుషంగా వివరించారన్నారు.

ఎండిపోతున్న పంటలకు నీరివ్వాలి

విశాలాంధ్ర-గన్నవరం : ఎండిపోతున్న వరిపంటకు నీరు అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం గన్నవరం నియోజకవర్గ కార్యదర్శి కట్టవరపు విజయరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు గన్నవారం మండలంలోని పురుషోతపట్నం, కొండపావులూరు, గొల్లనపల్లి, గన్నవరం గ్రామ సచివాలయాలలో సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయరావు మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులను వ్యవసాయ కూలీలను వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వర్షాభావం తక్కువగా ఉన్న మండలాలు కరువు మండలాలుగా ప్రకటించాలని అన్నారు. రైతులకు కౌలు రైతులకు రుణమాఫీ చేయాలని, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలను గుర్తించి కరువుభత్యంగా రూ.35 కిలో బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా వ్యవసాయ పనులు లేని ప్రాంతంలో ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు రూ.600, 200 రోజులు పని కల్పించాలని, కరువు ప్రాంతంలో విద్యార్థులకు అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంగళ్ల శివయ్య, పడమట నరేష్, తాటి శివరామ కృష్ణారెడ్డి, సీహెచ్ వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ అప్పులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

విశాలాంధ్ర-కంకిపాడు : రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన అప్పులపై శ్వేత పత్రం విడుదల చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య డిమాండ్ చేశారు. కంకిపాడు గ్రామంలోని సీపీఐ పెనమలూరు నియోజకవర్గం సమితి కార్యాలయంలో సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాధకారిక బస్సు యాత్ర ప్రారంభించిన సందర్భంగా సీపీఐ తరపున ముఖ్యమంత్రికి కొన్ని విజ్ఞాపనలు చేస్తున్నట్లు చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఈ నాలుగున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అప్పులు ఎంత? దానిలో సంక్షేమ పథకాలకి ఖర్చుపెట్టినది ఎంత? అనే అంశాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని కోరారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో నిత్యవసర వస్తువులధరలు పెరిగి డీజిల్ పెట్రోల్ ధరలు పెరగడమే కాకుండా గ్యాస్ ధర 400 రూపాయలు నుండి గ్యాస్ ధర 1250 రూపాయలకు పెరగటం, జీఎస్టీ పేరు మీద అన్ని వస్తువులు ధరలు పెరగటం వలన సామాన్యుడికి ధరలు అందుబాటులో లేకుండా పోయాయని చెప్పారు. ఈ నేపధ్యంలో దేశ వ్యాప్తంగా కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం భారతదేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అనిల్ అంబానీ, గౌతమ్ అదాని కార్పొరేటిక్ కంపెనీలకు తాకట్టు పెట్టి ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నాశనం చేస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం లొంగి బతకటం సరైనది కాదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంఘాలను పోరాటాలు చేయనివ్వకుండా పోలీసుల ద్వారా అణిచివేయటాన్ని తప్పుబట్టారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి సామాన్యులకి అందుబాటులో లేని నిత్యావసరం వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలు తగ్గించాలని విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వరంగ సంస్థ గానే కొనసాగించాలని కోరారు. సీపీఐ పెనమలూరు నియోజకవర్గం కార్యదర్శి మున్నంగి నరసింహారావు మాట్లాడుతూ పెంచిన కరెంటు చార్జీలను వెంటనే తగ్గించాలని స్మార్ట్ మీటర్లు బిగించే విధానం విరమించుకోవాలన్నారు.

రూ.4.60 లక్షలతో సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధునీకరణ

విశాలాంధ్ర-చల్లపల్లి : ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని, దాని కోసం ప్రభుత్వం మెరుగైన వైద్యం ఉచితంగా అందిస్తోందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. చల్లపల్లిలో నాబార్డ్ నిధులు రూ.4.60 కోట్లతో ప్రతిష్టాత్మకంగా ఆధునీకరించి నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్ర భవన సముదాయాన్ని కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ సోమవారం ప్రారంభించారు. చల్లపల్లి నడిబొడ్డున 2.80 ఎకరాల విస్తీర్ణంలో 12287.92 చదరపు అడుగుల పరిధిలో 30 పడకల ఆసుపత్రిలోని అడ్మినిస్ట్రేటివ్ విభాగం, ఓపి - డెంటల్, జనరల్, టీబీ, రక్త పరీక్ష చేసే ల్యాబ్, ప్రైమరీ పోటీ కాంప్లెక్స్, లేబర్ రూమ్, జనరల్ వార్డులు, ఫిజియోథెరపీ, ఐసిటిసి, కాజువాలిటీ, స్టోర్లు వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయిని, ప్రభుత్వం నాడు-నేడు ద్వారా ఆస్పత్రులను అధునాతనంగా మార్చిందని, ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా తీర్చిదిద్దిందన్నారు. వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపట్టి రోగులకు కావాల్సినన్ని సదుపాయాలు కల్పించిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ మాట్లాడుతూ, పేదల కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని రూపొందించి అమలు చేసిన రాజన్న బిడ్డ మన ముఖ్యమంత్రి జగనన్న పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఆసుపత్రులను అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. పేదవారికి అవసరమైన విద్య, వైద్యంపై సీఎం జగన్ అత్యంత శ్రద్ధ వహిస్తున్నారని అన్నారు. పేదలకు అధునాతన వైద్య సేవలు, ఎనిమిది మంది స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు, 30 పడకలు, క్యాజువాలిటీ విభాగం ఈ ఆసుపత్రిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి మండలాల ప్రజలు ఈ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైసీపీ రైతు విభాగం జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు, చల్లపల్లి జడ్పిటిసి రాజులపాటి కళ్యాణి, ఎంపీపీ కోట విజయ రాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు,డి సి హెచ్ శ్రావణ్ కుమార్, చల్లపల్లి తహసిల్దార్ కె.గోపాలకృష్ణ, చల్లపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ వేమూరి వెంకటరత్నం, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ నజరీనా, మండలపార్టీ అధ్యక్షులు నాని, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ కోర్టులో ఈనెల 30 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు న్యాయవాదులు విధులు బహిష్కరిస్తున్నట్లు మొవ్వ బార్ అసోసియేషన్ అధ్యక్షులు పులి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొల్లురు రామాంజనేయులు సోమవారం పేర్కొన్నారు. రూ.20 స్టాంపు గురించి స్టేట్ బార్ కౌన్సిల్ నిరంకుశంగా వ్యవహరించడంతో నిరసనగా తొలుత ఐదు రోజులపాటు న్యాయస్థాన విధులు బహిష్కరిస్తున్నట్లు వారుతెలిపారు. అయితే 20 రూపాయలు స్టాంపు విషయంలో స్పష్టత వచ్చేంతవరకు కొనసాగుతుందని కూడావివరించారు. దీనికి కక్షిదారులు, అధికారులు సహకరించగలరని కోరారు. వీరితోపాటు కూరేటి శ్రీ వెంకటేశ్వరరావు (ఉపాధ్యక్షులు), మారం సరస్వతి (మహిళా కార్యదర్శి), మోపిదేవి ద్వారకనాథ్, పడమటి రాధాకృష్ణ (సంయుక్త కార్యదర్శులు), టీ ప్రసాద్ (సాంస్కృతిక మరియు క్రీడల కార్యదర్శి), శ్రీపతి బాలసుబ్రమణ్యం (కోశాధికారి)పోతుల శివ శ్రీనివాసరావు ((గ్రంథాలయ కార్యదర్శి) తదితరు న్యాయవాదులు పాల్గొన్నారు.

జిల్లాలో మద్యం, నాటుసారాను అరికట్టాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో అక్రమ మద్యం రవాణాపై దృష్టి సారించాలని, నాటు సారా కేంద్రాలను అరికట్టాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో ఎక్సైజ్, ఎస్ఇబి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యం రవాణా పై దృష్టి సారించాలని, ముఖ్యంగా తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ప్రత్యేక విజిలెన్స్, నిఘా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మద్యం దుకాణాల పనితీరుపై కలెక్టర్ సమీక్షిస్తూ ఎక్సైజ్ సీఐల వారీగా, డిపోల వారీగా, షాపుల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ అంశాలపై, అధికారుల పెర్ఫార్మెన్స్ ప్రతినెల సమీక్షిస్తామన్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ లోని ఎస్ ఈ బి విభాగం సమన్వయంతో అక్రమ మద్యం రవాణా, బెల్ట్ షాపులను అరికట్టాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు డ్యూటీ పెయిడ్ లిక్కర్ (డి పి ఎల్) సంబంధించి 231 కేసులు నమోదు చేసి 485 లీటర్లు సీజ్ చేసినట్లు, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ 10 కేసులు నమోదు చేసి 105 లీటర్ల సీజ్, ఐడి (నాటు సారాయి) 130 కేసులు నమోదు చేసి, 9615 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసి, 425 లీటర్ల సారాయి సీజ్ చేసినట్లు, ఈ కేసులకు సంబంధించి 391 మందిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెంట్ సునీత కలెక్టర్కు నివేదించారు. ఈ సమావేశంలో ఏఎస్పి శ్రీహరిబాబు, డిస్ట్రిక్ట్ అడ్మినిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ అశోక్, జిల్లాలో ఎక్సైజ్ సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అర్జీల సకాలంలో పరిష్కరించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : సోమవారం నగరంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరా జిత సింగ్, డిఆర్ఓ పెద్ది రోజా, మచిలీపట్నం ఆర్డిఓ ఎం వాణిలతో కలిసి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించారు. సంబంధిత అధికారులను పిలిపించి అర్జీల పరిష్కారంపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా అధికార యంత్రాంగం స్వీకరించిన అర్జీలలో కొన్నింటి వివరాలు ఇలా ఉన్నాయినందివాడ మండలం పొనుకుమాడు గ్రామానికి చెందిన జే. వెంకటేశ్వర్లు, ఐ.ఎం.ఆదిలక్ష్మి, బి పావని, బి.సలోమీ తదితరులు మాట్లాడుతూ తామంతా రైతులమని 17 సంవత్సరాల క్రితం వ్యవసాయం కుదరక సుమారు 33 ఎకరాలు 73 సెంట్లు భూమిని చేపల చెరువుగా తవ్వకొని ఉమ్మడిగా సాగు చేసుకుంటున్నామని, మూడు సంవత్సరాల క్రితం కొందరు చెరువులో నాలుగు ఎకరాలు భూమిని కొనుగోలు చేశారని రైతులందరితో ఉమ్మడిగా ఉండి చేపల చెరువు సాగు చేస్తామని పెట్టిన షరతుకు అంగీకరించే భూమి కొనుగోలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతిబసు,డ్వామా, డిఆర్డిఏ పిడిలు జి.వి. సూర్యనారాయణ, పి ఎస్ ఆర్ ప్రసాద్,మున్సిపల్ కమిషనర్ చంద్రయ్య,డి ఎస్ ఓ పార్వతి, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పిడి సువర్ణ, దేవాదాయశాఖ ఏసి శాంతి, జిల్లా ఉద్యాన అధికారి జే. జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసదుపాయాలు

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రజలకు మెరుగైన వైద్యసదుపాయాలు అందుతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి గీతాబాయి అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి గీతాబాయి అధ్యక్షతన జిల్లాలోని క్షేత్రస్థాయి పర్యవేక్షక సిబ్బందితో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నెలవారి ప్రగతి నివేదికలపై సమీక్ష సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు వైద్యాధికారులకు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో ముఖ్యంగా సిబ్బంది నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో గుర్తించినటువంటి రోగులకు రిఫరల్ సేవలు అందుబాటులో ఉన్న వైద్యశాలలకు, నెట్వర్క్ వైద్యశాలలకు రెఫరల్ చేసి వారికి కావాల్సిన వైద్య సేవలను అందించవలసినదిగా ఆదేశించినారు. అదేవిధంగా జిల్లాలో నిర్వహించిన కంటి వెలుగు స్క్రీనింగ్ కార్యక్రమంలో గుర్తించిన దృష్టిలోపం ఉన్నవారికి కావలసిన కళ్ళజోళ్ళ పంపిణీ, కాంట్రాక్ట్ చేయించాల్సిన వారికి త్వరలో అందుబాటులో ఉన్న ప్రాంతాలలో నిర్వహించే క్యాంపులో కాంట్రాక్ట్ చేయించాలని ఆదేశించినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకట్రావు డిటిసి ఓ ,డాక్టర్ సీతాకుమారి, డాక్టర్ వై మహేష్ ,డాక్టర్ విజయభారతి ,డాక్టర్ కె రత్నగిరి, జిల్లా మలేరియా అధికారి బి రామారావు, బి శివసాంబి రెడ్డి ,ఆనంద్ యస్.ఓ., డాక్టర్ నాగ భవాని ,శ్రీ శాస్త్రి, తదితరులు పాల్గొన్నారు.

చల్లపల్లిలో బాబుతో నేను

విశాలాంధ్ర-చల్లపల్లి : టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేసిన వైనాన్ని ప్రజలకు తెలియచేసేలా చేపట్టిన "బాబుతో నేను" కార్యక్రమం చల్లపల్లి మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం చల్లపల్లిలో జరిగింది. స్థానిక 11వ వార్డులో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా నేత, క్లస్టర్ ఇన్చార్జి మోర్ల శివ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు షేక్ నబీఖోరి, యూనిట్ ఇన్చార్జి పరాన్ జిలానీ, బూత్ ఇన్ఛార్జ్ అంబటి భువనేశ్వరరావు, అద్దంకి నాగరాజు, పరిశీ రఘు, గజ్జల ఆంజనేయులు, పరిశీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. బాబుతో నేను కరపత్రాలను ప్రజలకు అందించి రాజకీయ కక్షతో చంద్రబాబును అరెస్ట్ చేసిన విధానాన్ని ప్రజలకు తెలియచేశారు. చంద్రబాబుకు పలువురు మద్దతు తెలియచేస్తూ మిస్కాల్ ఇచ్చారు. బాబుతో మేము అంటూ నినదించారు.

జర్మనీ దేశస్తులు కలంకారి కళ సందర్శన

విశాలాంధ్ర- గూడూరు: వాసవ్య మహిళా మండలి విజయవాడ మరియు హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సౌజన్యంతో సోమవారం గూడూరు మండలంలోని కప్పలదొడ్డి ఆకులమన్నాడు పోలవరం గ్రామాలలో కలంకారి కళాకారులకు నేతన్నలకు వారి యొక్క జీవనోపాధి అభివృద్ధి చేసేందుకు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతున్నది. ఈ సందర్భంగా వాసవ్య మహిళా మండలి సెక్రటరీ జి. రష్మీ సమరం మాట్లాడుతూ, జర్మనీ యూత్ ఎక్స్ఛేంజ్ టీం తో కలిసి కప్పలదొడ్డి గ్రామంలో కలంకారి కళాకారులు చేయు పనులను సందర్శించావు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారిని వాసవ్య మహిళా మండలి చేస్తున్న సామాజిక అభివృద్ధి కార్యక్రమాలలో కలంకారి పరిశ్రమ అభివృద్ధి కొరకు భాగస్వామ్యం కోరుతాను రష్మీ చెప్పారు. ఈ కార్యక్రమంలో కలంకారీ కళాకారులు గ్రామస్తులు మరియు వాసవ్య మహిళా మండలి బృందం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కాజ విద్యార్థులు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని కాజ శ్రీ పేకేటి నరసారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ లోని ఇద్దరువిద్యార్థులు నవంబర్ 4వ తారీఖున వేర్వేరు జిల్లాలలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీవీ రమణి సోమవారం విలేకరులకు తెలిపారు. అండర్ 14 బాలికల విభాగంలో బాల్.బ్యాడ్మింటన్ కి కృష్ణాజిల్లా టీం లో సందోలు సువర్ణ (7వ తరగతి) నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొంటుందన్నారు. అలాగే అండర్ 17 బాలుర విభాగంలోచంద్రగిరి నాగలక్ష్మణ్(9వ తరగతి) ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగే సాఫ్ట్.బాల్ లో రాష్ట్రస్థాయిపోటీలకు హాజరవుతాడు. ఈ విద్యార్థులకు శిక్షణను ఇచ్చిన పిడి నాగ బసవయ్య, పోటీలకు హాజరయ్యే విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు రమణి అభినందించారు.

అవినీతికి దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : అధికారులు-సిబ్బంది అన్ని రకాలుగా అవినీతిని విస్మరించి ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) డి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. విజయవాడ డివిజన్‌లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు (అక్టోబర్ 30- నవంబర్ 05) జరుగుతున్న సందర్భంగా సోమవారం డివిజనల్ ఆఫీస్ కాంపౌండ్‌లో అధికారులు,సిబ్బందితో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంవత్సరం ప్రచారం యొక్క థీమ్ "అవినీతి వద్దు- దేశానికి కట్టుబడి ఉండండి". అనే నినాదంతో ముందుకు వెళ్ళతామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు-సిబ్బంది అన్ని రకాలుగా అవినీతిని నిర్మూలించాలని మరియు అన్ని రంగాలలో చట్టబద్ధత మరియు నియమాలను పాటించాలని మరియు ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలన్నారు. అవినీతి రహిత భారతదేశం కోసం కృషి చేయాలని, సమగ్రతతో పని చేసే వ్యవస్థలో పారదర్శకత ఉండేలా చూడాలని సిబ్బందికి విజ్ఞప్తి చేశారు. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా విజయవాడ డివిజన్ 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని యూనిటీ రన్, సెమినార్లు అనేక ఇతర అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఆర్ఎం ఎం.శ్రీకాంత్ ఇతర బ్రాంచి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర-కూచిపూడి : ప్రభుత్వ అభివృద్ధిని వివరిస్తూ ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కారానికి మార్గం చూపటమే" గడపగడపకు మన ప్రభుత్వం" లక్ష్యం అని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఆయన సోమవారం రాత్రి మొవ్వ మండలంలోని వేములమడ గ్రామంలో ఈ కార్యక్రమాన్నితిరిగి ప్రారంభించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యవేక్షణలో పలు సంక్షేమ పథకాలు అమలుపరుస్తూ అర్హతలే ప్రామాణికంగా తీసుకుని రాజకీయాలకతీతంగా మంజూరు చేస్తూ పేదల గుండెలలో చెరగని ముద్ర వేసుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఈ దశలో ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు దయ్యాల వేదాలు వల్లించినట్లు ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ జి సుధా ప్రవీణ్, జీ.సుధాప్రవీణ్, తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయప్రసాద్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు,గ్రామ సర్పంచ్ వేములమడ సీతారామయ్య, ఎంపీపీ కొండేటి ఇందిర, ఎంపీటీసీ సమ్మెట ఆంజనేయులు, గ్రామ కార్యదర్శి ఎం.ఎస్.ఎస్ మూర్తి,, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షపు నీటిని నిల్వ చేయండి : ఎంపీపీ గోగం

విశాలాంధ్ర-పెదపారుపూడి : వర్షపు నీటిని భూములోకి ఇంకింపచేసి భూగర్భ జలాలను వృద్ధి చేయుట కొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఆ ప్రకారం చేయటానికి ఆదేశాలు జారీ చేసినందున మండలంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న స్థలములో గుంటలు తీసి ఆ గుంటలలో ఇసుక, కంకర, తదితర ముడి సరుకులు వేసి వర్షపు నీరు వృధా కాకుండా నిలువ చేయటానికి స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రారంభించినట్టు ఎంపీపీ గోగం సురేష్ సోమవారం తెలిపారు. ఆ విధంగా చేయుట వలన భవిష్యత్తులో నీటి ఎద్దడి లేకుండా వేసవిలో కూడా భూమిలో నీరు సమృద్ధిగా ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఏపీవో నత్త స్ఫూర్తి, ఈసి విజయరాజు, బి ఎఫ్ టి జి అశోక్ కుమార్, దుంగా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వాసవి వనిత క్లబ్‌కు అవార్డులు

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి వాసవి వనిత క్లబ్ 2023 వ సంవత్సరంలో నిర్వహించిన పలు సేవా కార్యక్రమాలకు నాలుగు అవార్డులను కైవసం చేసుకున్నారు. ఇదే విషయాన్ని సోమవారం ఆ క్లబ్ అధ్యక్షురాలు వలివేటి లక్ష్మి కూచిపూడి కార్యాలయంలో విలేకరులకు తెలిపారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ (విజయవాడ) నిర్వహించిన వినయ విధేయ మహోత్సవంలో ఈ క్లబ్ కు'బెస్ట్ ప్రెసిడెంట్', 'సూపర్ బెస్ట్ క్లబ్','సూపర్ బెస్ట్ బ్యానర్ ప్రజెంటేషన్','న్యూ మెంబర్ షిప్ క్యాంపెయిన్'లకు అభినందించి సిల్వర్ కప్పును వాసవి క్లబ్ గవర్నర్ రామచంద్ర రావు జిల్లా సమావేశంలో ఆదివారం రాత్రి అందజేశారని ఆమె వెల్లడించారు. ఈమెతోపాటు కటకం అనురాధ (కార్యదర్శి)వెంట్రప్రగడ లక్ష్మి (కోశాధికారి), సభ్యులు పాల్గొన్నారు.

36వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక 36వ వార్డులోని బిసి సంక్షేమ వేల్ఫేర్ హస్టల్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ కమిషనర్ వి.మురలీకృష్ణ, వైసిపి పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీనులు పాల్గొని వైద్య శిభిరాని ప్రారంభించారు. వార్డులోని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది,వాలంట్రీలు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో 8,818 మందికి పింఛన్లు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని 16 సచివాలయాలలో నవంబర్ ఒకటి నుంచి 5వ తేదీ వరకు వైయస్సార్ పెన్షన్ కానుక లో 8818 పెన్షన్లు ద్వారా రూ.2,38, 57,500ను పంపిణీకి సిద్ధం చేసినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. సచివాలయాల వారీగా సామాజిక పెన్షన్లు పంపిణీ చేసే వివరాలు ఇవే... అవురిపూడి సచివాలయంలో 412, అయ్యంకిలో 510, భట్ల పెనుమర్రులో 548, చినముత్తేవిలో 361, కాజ..1 లో 676, కాజ..2 లో 580, కోసూరులో 943, కూచిపూడి లో 601, మంత్రి పాలెం లో 374, మొవ్వ...1లో 489, మొవ్వ..2 లో 408నిడుమోలులో 579 , పెద ముత్తేవిలో615, పెదపూడి లో 718, పెడసనగల్లులో 526, వేములమడ సచివాలయంలో 480 మందికి పెన్షన్లు అందజేస్తారు.

సుబ్రహ్మణ్యేశ్వరరావుకి పీహెచ్‌డీ

విశాలాంధ్ర-బంటుమిల్లి :- ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని ఆర్ట్స్ కళాశాలలో ఉన్న తెలుగు విభాగంలోనే పరిశోధన చేసినందుకు దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావుకు పిహెచ్.డి ప్రదానం చేసినట్లు రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డా. పి కిరణ్మయి తెలిపారని పి హెచ్ డి గ్రహిత సోమవారం పాత్రికేయులకు వివరించారు. బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామానికి చెందిన దాసరి సుబ్రహ్మణ్యేశ్వర రావు కృష్ణాజిల్లా గుడివాడ మండల నాటక రచయితల నాటకాలు - ఒక పరిశీలన " అనే అంశము మీద పరిశోధన గ్రంథము సమర్పించినారు. ఎస్ ఎమ్ ఎస్ రావు దాసరి పరిశోధనకు పర్యవేక్షకులు (రీసెర్చ్ గైడ్) గా డా. బూసి వెంకట స్వామి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఏ ఎన్ యు విసి ప్రొఫెసర్ పి రాజశేఖర్, ఏ ఎన్ యూ ఆర్ట్స్ కామర్స్ అండ్ లా కళాశాలల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి మరియు తెలుగు విభాగంలో తెలుగు శాఖాధ్యక్షులు ప్రొఫెసర్ మాధవి,అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

రెవెన్యూలో అవినీతిపై బాధ్యులపై చర్యలు : వీఎంసీ డిప్యూటీ కమిషనర్

విశాలాంధ్ర ఎఫెక్ట్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థలోని రెవిన్యూ విభాగంలో జరుగుతున్న అవినీతిపై సోమవారం విశాలాంధ్రలో ప్రచురితమైన అవినీతికి అడ్రస్ రెవిన్యూ అనే వార్తకు స్పందన లభించింది. దీంతో సంబంధిత అవిగాం అధికారులు దర్యాప్తుకు ఆదేశించారు. దర్యాప్తు అనంతరం విచారణ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని రెవిన్యూ డిప్యూటీ కమిషనర్ తెలిపారు.

కె.కండ్రికలో పీఏసీఎస్ శాఖ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ : స్థానిక 64వ డివిజన్ కుందా వారి కండ్రికలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన కార్యాలయాన్ని వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఆయన వెంట రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు, జాయింట్ కలెక్టర్ సంపత్ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తాతినేని పద్మావతి, డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ రెడ్డి, డివిజన్ కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ తదితరులు ఉన్నారు. అనంతరం జరిగిన మరో కార్యక్రమంలో డివిజన్‌లో రూ.352 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను మంత్రి కాకాణి స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : ఎకరానికి 30 క్వింటాలు చొప్పున ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ధాన్యం సేకరణకు ప్రతి కౌలురైతుకు 25 ఎకరాల వరకు పరిధి విధించి రైతు పండించిన పంటను కొనుగోలు చేయాలని, వరిపండించే ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కౌలురైతులసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధాన్యం అరబెట్టుకోవడానికి టార్పాలిన్ పంటాలను పూర్తి సబ్సిడీతో కౌలు రైతులకు అందించాలని పి.జమలయ్య కోరారు. కౌలురైతు యొక్క స్వయ ధృవీకరణతో (సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా) ఇ-క్రాప్ బుకింగ్ చేయాలని, ఈ క్రాప్ బుకింగ్ ద్వారా కౌలురైతులు తమ పంటను అమ్ముకోవడానికి వెసులుబాటు కల్పించాలని కోరారు. సోమవారం రైతు సంఘం జిల్లా కన్వీనర్ మల్నీడు యలమందారావు అధ్యక్షతన కౌలురైతుల సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఇబ్రహీంపట్నం రైతుసంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా పి జమలయ్య మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల ఎన్టీఆర్ జిల్లాలో పత్తి ,మిర్చి, వరి తదితర పంటలు ఎండిపోతున్నాయాని,ఎండిపోతున్న పంటలను నీరు ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఖరీఫ్ లో కొనుగోలు చేసే ధాన్యానికి ఇప్పటికీ కొంతమంది రైస్ మిల్లర్లు రైతులకు డబ్బులు చెల్లించలేదని ఆ మిల్లర్లను రాబోయే ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయ్యకుండా బ్లాక్ లిస్టులో పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కౌలురైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడానికి చర్యలు చేపట్టాలని అందుకుగాను ముందుగానే ప్రణాళికలు రచించి సిబ్బందిని నియమించాలని కోరారు.రైతుభరోసా కేంద్రాల్లో గుర్తించిన తేమ శాతాన్ని పరిగణలో తీసుకోవాలని, మిల్లర్స్ మరలా తేమ శాతాన్ని లెక్కించి రైతు దగ్గర నుండి తరుగుదల పేరుతో ధాన్యం తీసుకోరాదని ప్రభుత్వానికి విన్నవించారు.గతంలో అక్రమాలకు పాల్పడిన మిల్లర్లు బ్లాక్ లిస్టులో పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్నీడు యలమందారావు మాట్లాడుతూ ఎండిపోతున్న పంటలకు నీరు ఇచ్చి కాపాడాలని కోరారు.జగ్గయ్యపేట, నందిగామ తిరువూరు ప్రాంతాల్లో వేసిన పంటలను ఎండిపోతున్నాయని, పంటలు వేసి నష్టపోయిన కౌలురైతులకు పరిహారం చెల్లించాలని కోరారు. రబీలో ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుడ్డిరమేష్ తో పాటు కౌలురైతుల సంఘం నాయకులు నిమ్మగడ్డ శ్రీనివాసరావు, కిలారి సోములు,పెయ్యల వెంకటేశ్వరరావు, పి.హరికృష్ణ ,మేకల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని గాలికి వదిలేశాడు!

విశాలాంధ్ర-విజయవాడ : రాష్ట్రంలో విద్యా రంగాన్ని ప్రభుత్వం గాలికి వదిలేసిందని, విద్యాశాఖ మంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగళ్ళ సాయికుమార్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సమాఖ్య విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను మూడవ విడత కౌన్సెలింగ్ నిర్వహించి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని గాలికి వదిలేసి అధికారం కోసం పాకులాడుతూ విద్యా శాఖామంత్రి బస్సు యాత్రలో ఉన్నారని ఎద్దేవా చేశారు. విద్యార్థులకు మెరుగైన ఉచిత విద్య, వసతులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉపాధి కల్పిస్తే విద్యార్థులే స్వచ్ఛందంగా వారికి ఓట్లు వేసి గెలిపిస్తారని తెలిపారు. ఇలా బస్సు యాత్రలు, పాదయాత్రలు చేస్తే ఏ విద్యార్థి, విద్యార్థినీలు మిమ్మల్ని నమ్మి ఓట్లేసే పరిస్థితి ఆంధ్ర రాష్ట్రంలో లేరన్న విషయాన్ని గమనించాలన్నారు. ప్రతి ఏటా 3వ సారి కౌన్సెలింగ్ నిర్వహించే ఉన్నత విద్యామండలి ఈ ఏడాది రెండు విడతలతోనే సరిపెట్టిందన్నారు. మూడో విడత ఉంటుందని చాలామంది విద్యార్థులు రెండో విడతలో సీట్లు వచ్చినా చేరలేదని, మరికొందరు కోర్సులు, కళాశాలలు మార్చుకోవచ్చని ఎదురుచూస్తున్నారని తెలిపారు. విద్యార్థుల నుంచి వినతులు రావడంతో మొదట్లో కౌన్సిలింగ్ నిర్వహణపై పరిశీలిస్తున్నామని మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారని, ఇంతవరకు దీనిపై ఉన్నత విద్యామండలి స్పష్టత ఇవ్వలేదన్నారు. దీంతో విద్యార్థులు ఆందోళనలో ఉన్నారని, కన్వీనర్ కోటాలో చేరేవారిలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేదవారే ఉంటారని వివరించారు. కన్వీనర్ కోటాలో చేరేవారికి ప్రభుత్వమే బోధన రుసుములు చెల్లిస్తుందని, స్పాట్, యాజమాన్య కోటాల్లో చేరితే విద్యార్థులే ఫీజుల భారం భరించాల్సి ఉంటుందన్నారు. మూడో విడతపై స్పష్టత లేక.. చాలామంది స్పాట్, యాజమాన్య కోటాలో చేరాల్సి వచ్చిందని విద్యార్థులకు సౌలభ్యంగా ఉండాల్సిన కౌన్సెలింగ్ ప్రభుత్వం ఫీజుల డబ్బులు మిగుల్చుకునేలా ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయకపోతే అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలకు సిద్ధమవుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు ఈ అయ్యప్ప, సహాయ కార్యదర్శి బి సుధీర్ నాయకులు ఎస్. రంజిత్, కే.సాయి, మురళి, మోహన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 89 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): పోలీసు స్పందనకు 89 ఫిర్యాదులు అందాయి. సోమవారం సీపీ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు స్పందన కార్యక్రమంలో డీసీపీ అజిత వేజెండ్ల బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. లావాదేవీలకు సంబంధించినవి 28, భార్యాభర్తలు, కుటుంబ కలహాలకు 14, సివిల్ వివాదాలు 15, వివిధ మోసాలు 10, ఇంటి అద్దె విషయం 03, దొంగతనాలు 02, ఇతర చిన్న చిన్న వివాదాలు సమస్యలుకు, సంఘటనలకు సంబంధించినవి 17 ఫిర్యాదులు, మొత్తం89 ఫిర్యాదులును స్వయంగా స్వీకరించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడి సమస్యలను చట్టపరిధిలో చర్యలు తీసుకోవాలని సూచించారు.

టీడీపీ నిరసన ప్రదర్శనలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో శనివారం రాత్రి, ఆదివారం టీడీపీ నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో టీడీపీ కార్యకర్తలు నాయకులు కళ్లకు నల్ల గుడ్డలు ధరించి, చంద్రబాబు అక్రమ అరెస్టుపై నిరసన ప్రదర్శన చేశారు. వ్యవస్థలను మేనేజ్ చేసి, కక్ష సాధింపుచర్యలకు పాల్పడటాన్ని వారు ఈ సందర్భంగా దుయ్యబట్టారు. రైతుసంఘం నాయకుడు చెరుకూరి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో ఎండిన పంటలను పరిశీలించారు. ఎన్టీఆర్ జిల్లాలో సాగు నీరు, వర్షాలు లేక ఎండిన పంటలు సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జిల్లాను కరవు మండలంగా ప్రకటించి, రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో ఆపార్టీ నాయకులు నెక్కళపు వెంకటేశ్వరరావు, నెక్కళపు శ్రీనివాసరావు, దమ్మాలపాటి సాంబశివరావు, తుమ్మలపల్లి అనిల్, వడ్లమూడి చంటి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో లక్ష్యాలను సాధించాలి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : దివ్యాంగులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, ఆత్మస్థైర్యం, విశ్వాసంతో ముందుకు వెళ్లి అనుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లాకు చెందిన విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్, సైకిల్, వినికిడి యంత్రాలను కలెక్టర్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వారికి అవసరమైన ఉపకరణాలను పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉపకరణాలకు జిల్లా వ్యాప్తంగా 200 పైగా దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, వీటిలో అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి ఉచితంగా ఉపకరణాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ.నాగేశ్వరరావు, విభిన్న ప్రతిభావంతుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ వీ.కామరాజు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సికి బిర్లా చేయూత

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సికి బిర్లా గ్రూపు చెందిన హైదరాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ నిధులతో సహకారం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కార్పోరేట్ సోషల్ రెస్పాన్సిబుల్టీ ఫండ్‌లో భాగంగా రూ.5 లక్షల ఆర్థిక సహాయ చెక్‌ను సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులకు ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లికి చెందిన సికె బిర్లా గ్రూపుకు చెందిన హైదరాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ స్వచ్ఛందంగా రూ.5 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. హెచ్ఐఎల్ సంస్థ అందిస్తున్న నిధులతో జిల్లాలో పలు అభివృద్ధి పనులకు ఖర్చుచేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఏడూ ఆ సంస్థకు వచ్చే ఆదాయంలో ఒకటి నుండి రెండు శాతం సీఎస్ఆర్ ఫండ్‌గా అందించాల్సి ఉంటుందన్నారు. గతంలో హైదరాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రూ.7 లక్షల 10 వేలు షెడ్యూల్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు రక్షణ గ్రిల్స్, రూఫింగ్ కల్పనకు ముందుకు రావటం జరిగిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఐఎల్ లిమిటెడ్ యూనిట్ హెడ్ లక్ష్మికాంత్, మేనేజర్ సుబ్బారావు, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఎ.సుధాకర్ పాల్గొన్నారు.

స్పందనలో 120 ఆర్జీలు నమోదు

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : స్పందన కార్యక్రమం ద్వారా అర్జీదారుడు ఆశించిన స్థాయిలో సమస్య పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన ఒక ప్రత్యేక వేదికని స్పందనలో సమర్పించే ఆర్జీలకు నిర్దేశించిన గడువులోగా అధికారులు పరిష్కారం చూపాలని, అర్జీలు పునరావృతం కాకుండా వాటిని కుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాల్సిన భాధ్యత మనపై ఉందన్నారు. అర్జీదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యకు సరైన పరిష్కారం చూపినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందన్నారు. స్పందనలో స్వీకరించిన ప్రతి ఆర్థికి ఎకనార్లెంట్ తప్పనిసరిగా అందజేయాలన్నారు. స్పందన గ్రీవెన్స్ పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలని తరచు రీ ఓపెన్ అవుతున్న అర్జీలపై ఆయా శాఖలకు చెందిన అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. స్పందనలోనే కాకుండా వివిధ మార్గాలైన జగనన్నకు చెబుదాం-1902, ఆన్లైన్ పోర్టల్‌లో నమోదవుతున్న ఆర్జీలను పరిష్కరించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, స్పందన మొబైల్ యాప్, వెబ్ అప్లికేషన్ ద్వారా నమోదవుతున్న అర్జీలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి రోజు ఆఫ్ లైన్, అన్ లైన్లో నమోదవుతున్న అర్జీలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు. జిల్లాలోని డివిజన్ అధికారులు, మండల ఎంపీడీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమీషనర్లతో పరిష్కారమయ్యే వినతులు వర్చువల్‌గా పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీ డా.పీ.సంపత్ కుమార్, డీఆర్వో నాగేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమంలో మూడు అర్జీలు

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నాడు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 3 అర్జీలు అందినట్లు ఎంపీడీవో ఎర్రమల. పిచ్చిరెడ్డి తెలియజేశారు. కనుమూరు గ్రామం నుండి వర్ధిబోయిన. వెంకటరమణ తన నివాస గృహం ను స్వామిత్వా సర్వేలో సర్వే జరగకుండా తన సోదరుడు అభ్యంతరం పెడుతున్నాడని, తోట మూల గ్రామం నుండి గ్రామ నాయకులు రాంబాబు మరియు తదితరులు విశిష్ట కాలేజీ బస్సులు తమ నివాస గృహాల రోడ్డు మీద ప్రయాణించటం వలన చిన్న పిల్లల నుండి వృద్ధుల వరకు బస్సులు కలిగించే కాలుష్యం వలన ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయని, తునికిపాడు గ్రామం నుండి నల్లగట్ల. రమేష్ బాబు వృద్ధాప్య పెన్షన్ రాలేదని అర్జీలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వై. పిచ్చి రెడ్డి, తహసీల్దార్ జి. బాలకృష్ణ రెడ్డి మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయం గా ప్రభుత్వ పాలన సాగుతోందని, ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్ రెడ్డి రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటున్నారన్నారు. రైతును ఆదుకో వాల నే ఆలోచనతో పంటకు గిట్టుబాటు ధర అందించే విషయంలో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశామన్నారు. రైతులు పండించిన పత్తి పంటను కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. మధ్య దళారీలను ఆశ్రయించి రైతులు మోసపోవద్దన్నారు. సీసీఐ కూడా ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ ఉచిత పంటల బీమా, వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ, పంట నష్టపరిహారం, వైఎస్సార్ యంత్ర సేవ, ఉచిత వ్యవసాయ విద్యుత్ సబ్సిడీ ఇలాంటివి అమలు చేస్తూ జగనన్న రైతుకు అండగా నిలిచారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా వాకింగ్ ట్రాక్ నిర్మాణం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : పర్యాటక కేంద్రంగా ఊర చెరువు అభివృద్ధి పనులలో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వాకింగ్ ట్రాక్ సుందరీకరణ పనులను ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ప్రారంభించారు. అనంతరం ఊర చెరువు అభివృద్ధి పనులను పరిశీలించి వాకింగ్ ట్రాక్ కు ఇరువైపులా ఏర్పాటుచేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పట్టణ పౌరుల కోసం ఏర్పాటుచేసిన వాకింగ్ ట్రాక్ సుందరీకరణ పనులలో భాగంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకుగాను అందమైన ఆకర్షణీయమైన మొక్కలను వాకింగ్ ట్రాక్ కు ఇరువైపులా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.చెరువు అభివృద్ధి పనులకు సంబంధించి చెరువు చుట్టూతా ప్రహరీ గోడ,వాకింగ్ ట్రాక్ తదితర నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేయడం జరిగిందని.మిగిలిన పనులు కూడా త్వరలో పూర్తిచేసి పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్,పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, ఎస్టీ విభాగం అధ్యక్షులు బాద్దు నాయక్, పెనుగంచిప్రోలు సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, మున్సిపల్ అధికారులు,కాంట్రాక్టర్ వాసు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న తెలంగాణ మద్యం స్వాధీనం

విశాలాంధ్ర-నందిగామ: మండలంలోని జొన్నలగడ్డ గ్రామ సరిహద్దు చెక్పోస్ట్ వద్ద ఏసిపి జనార్ధన్ నాయుడు ఆదేశాల మేరకు సిఐ హనీష్ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో చలమల లక్ష్మీనారాయణ అనే వ్యక్తి నడుచు కుంటూ 25 సీసాల అక్రమ తెలంగాణ మద్యం రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ హనీష్ తెలిపారు.అక్రమంగా మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ హనీష్ హెచ్చరించారు.

సోషల్ ఆడిట్ వరకు గ్రామ సభలు

విశాలాంధ్ర-వీరులపాడు: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2022-23 సోషల్ ఆడిట్ లో భాగంగా వీరులపాడు మండలం దొడ్డ దేవరపాడు, పెద్దాపురం, అల్లూరు గ్రామాల గ్రామపంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామ సభలలో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనులు, పెన్షన్ల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఏపీవో జనార్ధన్, ఫీల్డ్ అసిస్టెంట్స్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో కరూర్ వైశ్యాబ్యాంక్ శాఖ ప్రారంభం

విశాలాంధ్ర-నందిగామ : కరూర్ వైశ్యా బ్యాంకు వారు తమ శాఖల విస్తరణలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 826వ శాఖను ఏర్పాటు చేశారు. ఈ నూతన శాఖను నందిగామ ఆర్‌డీఓ ఏ.రవీంద్రరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. స్థానిక వైష్ణవి హాస్పటల్ వైద్యులు డాక్టర్ కె.మానస జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు డివిజనల్ మేనేజర్ కేవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ తమ డివిజన్ పరిధిలో ఇది 54వ శాఖ అన్నారు. విజయవాడ డివిజన్ రూ.6710.52 కోట్ల వ్యాపారం చేసిందన్నారు. తమ బ్యాంకు 1916లో రూ.లక్ష మూలధనంతో స్థాపించబడి ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.160.41 కోట్ల మూలధనానికి చేరిందన్నారు. అంతేకాకుండా రూ.1106.09 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసిందని వివరించారు. డివిజనల్ నిర్వహణాధికారి ఐవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేవీబీ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను నందిగామ, పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై కొంత మంది అమానుషంగా చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వపరంగా బెయిల్ రాకుండా చర్యలు తీసుకోవాలని చట్టపరంగా కఠినమైన శిక్ష పడ విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీవో అధ్యక్షులు బండి శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. సోమవారం గాంధీ నగర్‌లోని వారి కార్యాలయంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్-ఏపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడురోజుల క్రితం కావలి నగరంలో విజయవాడ ఆటోనగర్ డిపో డ్రైవర్‌పై కొందరు వ్యక్తులు అమానుషంగా విచక్షణారహితంగా భౌతికంగా దాడి చేయటం దురాగ్రం అన్నారు. నిరంతరం రాత్రనకా పగలనకా ప్రజల మధ్య విధులు నిర్వహిస్తున్న చిరు ఉద్యోగులు అయిన వారిపై విచక్షణారహితంగా కొట్టిన తీరును సామాజిక మాధ్యమాలలో చూసిన ఆర్టీసీ కార్మికులందరూ తీవ్రమైన భయాందోళనకు గురి అవుతున్నారన్నారు. అయితే ప్రభుత్వం పోలీసులు సత్వరం స్పందించి కేసునమోదు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. దాడిచేసిన నిందితులలో కొంతమందిని పోలీసులు అరెస్ట్ చేశారని, ప్రధాన నిందితుడిని కూడా అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కావటంలేదన్నారు. మరికొన్ని అర్థిక పరమైన అంశాలు అయిన దాదాపు రూ.1200 కోట్లు డిఏలు, ఇతర అలవెన్సులు కూడా రావాలని అవి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులకు కూడా డిఏలు రావాల్సి ఉందని, రాష్ట్రంలో ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు చాలా తక్కువగా ఉన్నాయని వారి జీతాలు పెంచాలన్నారు. నవంబర్ 3న ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో లక్షల మందితో సీపీఎస్ వద్దు-పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ దాదాపు లక్ష మందితో ధర్నా చేస్తున్నామని దీనిని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి కె.వి.శివారెడ్డి,ఏపి పిటిడి నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ అధ్యక్షులు పివి రమణారెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

In the Court of the IV Addl Junior Civil Judge at Vijayawada
OS No. 1545/2022
(and also in I.A.No.636/2022)
Between:
Tummatati Padamavathi
@ Madduluri Hellen Padmavathi
- Plaintiff
And
1. Tummatati Dayakar Tej
2. Avutupalli Bhavana Velangini
- Defendants
Court Notice to Defendant No.2 :
Avutupalli Bhavana Velangini,
W/o. Avutupalli Venkatesh,
R/o. Flat No. FOF-1, Fifth floor,
Sai Balaji Residency, NTR Street,
Ramavarappadu, Vijayawada- 521107.
Plaintiff దాఖలు చేసిన పై నంబరు దావా O.S.No.1545/2022లో మీరు 2nd defendant గాను, దావాలోని Injunction Petition I.A.No.636/2022లో మీరు 2nd Respondent గా ఉండి ఉన్నారు.
పై నంబరు దావా మరియు పిటిషన్‌లో మీ హాజరు కొరకు శ్రీ కోర్టువారు ది. **21-11-2023వ తేదీకి** వాయిదా వేసియున్నారు. ఆ రోజు మీరు స్వయముగాగాని, లేదా మీ లాయరుగారి ద్వారాగాని కోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపర్చుకోగలరు. లేనియెడల పై నంబరు దావా మరియు పిటిషన్ మీ పరోక్షంలో తీర్మానించబడుతుంది.
(కోర్టువారి ఆర్డరు ప్రకారము)
కోట జయరాజు, పంచాది మోహనరావు,
అడ్వకేట్స్, మై హోమ్ కాంప్లెక్స్, ఎస్ఆర్ఆర్ కాలేజీ ప్రక్కన, మాచవరం,విజయవాడ-4.
విజయవాడ 30-10-2023
సెల్ : 9848407702, 9440631211

సంచార జాతులకు డీఎన్‌టి ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఎస్సీ,ఎస్టీ అందుతున్న అని పథకాలు,సౌకర్యాలు కల్పించటంతో పాటు అట్రాస్టీ కమిషన్ లాగా ప్రత్యేక సంచార జాతుల వారి కోసం ది నోటిఫైడ్ ట్రైబుల్స్ (డి.ఎన్.టి) కమిషన్ ఏర్పాటు చేయాలి అని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేస్తున్నామని సంచార జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర అధ్యక్షులు గోరంట్ల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర సంచార జాతుల అభివృద్ధి మండలి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా జనాభా లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు.ఎస్సీ,ఎస్టీ మాదిరిగా మాకు కూడా 12% రిజర్వేషన్ మాకు ఇవ్వాలన్నారు.తమకు రాజ్యాంగ మద్దంగా రావలసిన హక్కులు అందక అనేక రకాలుగా నష్టపోతున్నామన్నారు. ఎన్నికల్లో మా ఓట్లు కోసం తమను మభ్యపెడుతున్నారని అధికారంలోకి రాగానే నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.ప్రతి సారి మోసంపోవటం జరుగుతుందని ఇక నుండి అలా జరగకుడదనే లక్ష్యంతో సంచార జాతుల అభివృద్ధి మండలి పేరుతో రాష్ట్రంలో మొదలు పెట్టాము దీన్ని ముందుకు తీసుకువెళ్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నుండి మా హక్కులు సాధించుకొవటం జరుగుతుందన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ పుట్నూరి వరలక్ష్మి మాట్లాడుతూ సంచార జాతుల కులాలకి డి.న్.టీ అని ఒకటే ఒక సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. తమకు రక్షణగా అట్రాసిటీ చట్టం తీసుకురావలన్నారు. యోగి అతిదేశ్వరానందగిరి స్వామి మాట్లాడుతూ సంచార జాతుల ఐఖ్యత కోసం నూనతంగా ఏర్పడిన సంచార జాతుల అభివృద్ధి మండలి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేయటం సంతోషకరమన్నారు. వచ్చే నెల నుండి రాష్ట్రంలో అన్ని జిల్లాలలో సంచార జాతులా ఆభివృద్ధి మండలి తరఫున సమావేశాలు నిర్వహిస్తామన్నారు.ఎస్టీ ఎస్సీలకు రిజర్వేషన్లు అమలు చేస్తున్న మాదిరిగా 36జాతులు ఉన్న సంచార జాతుల వారి బద్రతకు డిఎన్‌టి చట్టం రావలసిన అవస్యకత ఉందని దానిని ఏర్పాటు చేయవలసి భాద్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేయాలేకుంటే తీవ్రస్థాయిలో ఉద్యమాలు, సదస్సులు రాస్తారోకోలు చేస్తాం అని హెచ్చరించారు. అప్పటికి దిగి రాకుంటే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ది చెపుతామన్నారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్ఆర్ఓ ధూళిపాళ్ల ఏసుబాబు,సంచార జాతి నాయకులు రొట్ట లక్ష్మీ,దోమ్మ సత్యవతి,కటారి రవీంద్ర,తెల్లివైకుంఠరావు, సుబ్రహ్మణ్యం, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జేడీఎఫ్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : ప్రసిద్ధ జై ఆంధ్ర ఉద్యమ ఆశయాలను సాకారం చేయాలనే ఉద్దేశ్యంతో ఏర్పడిన క్రియాశీల రాజకీయ సంస్కరణల సంస్థ జె డి ఎఫ్ (జై ఆంధ్రా డెమోక్రటిక్ ఫోరమ్) ప్రధాన కార్యాలయాన్ని విజయవాడ, ప్రశాంతి నగర్‌లో వడ్డే శోభనాదేశ్వరరావు (వడ్డే శోభనాదేశ్వరరావు) ద్వారా ప్రారంభించారు. మాజీ పార్లమెంటు సభ్యుడు మరియు వ్యవసాయ శాఖ మాజీ మంత్రి). ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని ముందంజలో ఉంచేందుకు ఆంధ్రప్రదేశ్‌కు సంస్థలు చాలా అవసరమని, అలాంటి సంస్థ జెడిఎఫ్ అని జెడిఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని పేర్కొన్నారు. కాకాని వెంకటరత్నం వంటి నాయకులు ఆంధ్ర ప్రదేశ్ బాగు కోసం పోరాడుతూ జై ఆంధ్ర అనే ప్రజా ఉద్యమంలో తమ ప్రాణాలను త్యాగం చేశారని, ఏపీకి ఏపీ వనరులను సక్రమంగా కేటాయించాలని డాక్టర్ కాకాని పేర్కొన్నారు.జేడీఎఫ్ అదనపు కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ జై ఆంధ్ర ఉద్యమ అజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్రవ్యాప్తంగా జేడీఎఫ్ సంస్థాగత నిర్మాణం చేపట్టిందని , అన్ని రాజకీయ పార్టీలు ఏపీ సంక్షేమానికి ఏకగ్రీవంగా ప్రాధాన్యతనివ్వాలన్నారు .డాక్టర్ కాకాని అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జెడిఎఫ్ ఎజెండాను ప్రజల్లోకి చురుగ్గా తీసుకెళ్తున్నారని వైస్ ప్రెసిడెంట్ బేతు రామ్మోహన్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన వడ్డే శోభనాదేశ్వరరావు సుదీర్ఘంగా ప్రసంగిస్తూ ఏపీ ఫస్ట్ ఎజెండాను ముందుకు తీసుకెళ్లేందుకు జేడీఎఫ్ వంటి సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశయాలను నెరవేర్చడంలో గత టీడీపీ ప్రభుత్వం కూడా విఫలమైందని, విభజన సమస్యలు, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన సమస్యలను నెరవేర్చడంలో కేంద్రం విఫలమవడంతో ప్రస్తుత పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. ఏపీ అభివృద్ధికి అన్ని పార్టీలు చిత్తశుద్ధితో పని చేయాలని, ఏపీ ప్రజల అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అనంతరం వడ్డేను జెడిఎఫ్ సభ్యులు ఘనంగా సత్కరించి జై ఆంధ్ర నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేడీఎఫ్ సభ్యులు గద్దె చంద్రశేఖర్, ఆచార్య ఎన్జీ రంగా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు గోగినేని ధనశేఖర్, జేడీఎఫ్ కార్యదర్శి మేడా శ్రీనివాస్, ఆమ్ ఆద్మీ పార్టీ టాటా సేవా కుమార్, యూ శ్రీనివ్వ మూర్తి, డీవీఎస్ మూర్తి, ఎన్ పవన్, పి లావణ్య, యు బాష తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఇంటర్ జిల్లా చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన శారదా విద్యాసంస్థల విద్యార్థి

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఈ నెల 13 నుండి 16 వరకు అనంతపూర్ టేబుల్ టెన్నిస్ అసోషియేషన్ వారిచే అనంతపూర్ ఆర్.డి.టి జూడో ఇండోర్ స్టేడియంలో రాష్ట్రస్థాయిలో జరిగిన టేబుల్ టెన్నిస్ పోటీలలో మొగల్రాజపురం లోని శారద కళాశాల విద్యార్థి పి.వి.పవన్ సత్య వెంకటేష్ ప్రథమ స్థానాన్ని సాధించాడు.స్టేట్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ పోటీలలో ప్రథమ స్థానం సాధించడం తమకు ఎంతో గర్వంగా ఉందని, ఇకపై జరిగే పోటీలలో కూడా ప్రథమ స్థానంతో పాటు మరెన్నో పతకాలను సాధించాలని, విద్యార్థులు అటు చదువుతో పాటు ఇటు ఆటలలో కూడా ఆసక్తిని చూపించాలని తెలుపుతూ శారద విద్యాసంస్థల ఛైర్మన్ దా? వై రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై. శారదాదేవి అభినందించారు.పి.వి. పవన్ సత్య వెంకటేష్ రాష్ట్రస్థాయిలోనే కాక, అటు జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో కూడా మరెన్నో పతకాలను కూడా సాధించి ప్రథమవిజేతగా ఉంటూ క్రీడాసక్తి ఉన్న ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయంగా ఉండాలని కోరుతూ, అభినందించారు. అంతేగాక ఆటలతో మానసిక మరియు శారీరక ఆహ్లాదకరమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని కళాశాల అడ్వైజర్ ఈ.యస్.ఆర్.కె.ప్రసాద్, కళాశాల జి.యమ్.జి.వి రావు తెలిపారు.

ఏషియన్ చాంపియన్‌షిప్‌లో పథకాలు సాధించిన నగర స్కేటర్లు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: చైనాలో జరిగిన 19వ ఏషియన్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ లో నగరానికి చెందిన కె. కైవల్య క్యాడెట్ ఇన్లైన్ బాయ్స్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించాడు. అదేవిధంగా ఫైయిర్ స్కేటింగ్ విభాగంలో కైవల్యా, చైత్ర "జిత్ జోడి బంగారు పథకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోనీ ఒక హోటల్ లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సందర్భంగా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డి దుర్గాప్రసాద్ క్రీడాకారులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించి, రాష్ట్రానికి, దేశానికి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలోరోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ కృష్ణా డిస్ట్రిక్ట్ అదనపు సంయుక్త కార్యదర్శి బచ్చు మురళీకృష్ణ, కోశాధికారి భువన్ షోమ్ తాతియ్య, ఉపాధ్యక్షులు ఎల్ వెంకటేశ్వరరావు, సభ్యురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొని క్రీడాకారులను అభినందించారు.

సందర్శకులను కనువిందు చేయనున్న లేపాక్షి గాంధీ శిల్ప బజార్

నగరంలో నేటి నుండి 10 రోజుల పాటు లేపాక్షి ఎగ్జిబిషన్

లేపాక్షి మేనేజింగ్ డైరెక్టర్ యం. బాలసుబ్రమణ్యంరెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన హస్త కళాకారులు కళా నైపుణ్యంతో రూపొందించిన హస్త కళారూపాలు సందర్శకులను కనువిందు చేయనున్నాయని లేపాక్షి మేనేజింగ్ డైరెక్టర్ యం. బాలసుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. ఈనెల 31 నుండి పది రోజుల పాటు లేపాక్షి హస్త కళా ప్రదర్శన, అమ్మకాలను నిర్వహిస్తున్నట్లు ఆయన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో గల సిద్ధార్థ హోటల్ మేనేజ్మెంట్ కళాశాల ఆవరణంలో జాతీయ స్థాయి హస్త కళల ప్రదర్శన లేపాక్షి క్రాఫ్ట్ బజార్-2023 నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని కర్నాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, రాజస్థాన్, మహారాష్ట్ర, బీహార్, ఒరిస్సా, తెలంగాణ తదితర రాష్ట్రలతో పాటు ఆంధ్రప్రదేశలో పేరు గాంచిన హస్త కళా ఉత్పత్తులను ప్రదర్శన ఏర్పాటు చేసి అమ్మకాలు నిర్వహించనునట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో 100 పైగా వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసి ఉడా కార్వింగ్, కొండపల్లి, ఏటికుప్పాక బొమ్మలు, రంగులతో తయారైన మట్టి పాత్రలు, దుప్పట్లు, లుంగీలు, టవల్స్, మంగళగిరి కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు, ఇమిటేషన్ జ్యూయలరీ వెండి వస్తువులు, కర్టెన్లు, సోఫా డైనింగ్ టేబుల్ కవర్లు తదితర హస్త కళా రూపాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఈ నెల 31 సాయంత్రం 4.30 గంటలకు లేపాక్షి గాంధీ శిల్ప బజార్ 2023ను ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

సంతృప్తికర పరిష్కారాలను అందించండి



విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరుగుతున్న స్పందన కార్యక్రమంలో అందుకున్న విజ్ఞప్తులకు సంతృప్తికర పరిష్కారాలు అందించి సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన 25 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన ఫిర్యాదులను ఆయా విభాగాల అధికారులు సూచించిన గడువులోగా పరిష్కారం అందించాలని ఆదేశించినట్లు తెలిపారు. స్పందనలో వచ్చిన ప్రతి సమస్యకు నిర్దిష్ట గడువులోపు పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థలోని వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ లో సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థినికి కాంస్యం

విశాలాంధ్ర విజయవాడ స్పోర్ట్స్: గోవాలో జరుగుతున్న 37వ జాతీయ క్రీడలలో బ్యాడ్మింటన్ మహిళల విభాగంలో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన సిద్ధార్థ మహిళా కళాశాల విద్యార్థిని టీ సూర్య చరిష్మా కాంస్య పథకం సాధించినట్లు సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ పద్మజా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ మహిళల జట్టులో కీ ప్లేయర్గా ప్రతిభ కనబరిచినందుకు కాంస్య పథకం సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా సూర్య చరిష్మాను కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు అభినందించారు.

గుణదల మాత ఊరేగింపును విజయవంతం చేయండి

విశాలాంధ్ర-గుడివాడ : గుణదల మాత 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 31వ తేదిన కార్మెల్‌మాత దేవాలయం నుండి గుణదలమాత తేరును పట్టణంలో ఊరేగింపును విజయవంతం చేయాలని మౌంట్ కార్మెల్‌మాత దేవాలయం ఫాదర్ గుజ్జుల మైఖేల్ పిలుపు నిచ్చారు. స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మెల్ మాత(ఆర్.సి.ఎం)దేవాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అయన మాట్లాడుతూ గుణదల లూర్థుమాత దేవలయం ఏర్పాడి శత వంసతాలు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. 100 సంవత్సరాలుగా మరియ్యతల్లిని దేశవ్యాప్తంగా కోనియాడడం జరిగుతుందన్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి 9,10,11 తేదిలలో విజయవాడలోని గుణదల మాత ఉత్సవాలు 100 సంవత్సరాల నుండి భక్తులకు అడిగిన వాటిని దయచేసుందని క్రైస్తవ విశ్వసుల నమ్మకమన్నారు. అలాంటి మరియ్యతల్లి మన గుడివాడలో మంగళవారం స్థానిక దేవలయంలో ఉదయం 9గం॥ల నుండి గుణదల లూర్ధుమాత స్వరూపం అందుబాటులో ఉంటుందన్నారు. సాయంత్రం 4గం॥ల నుండి ఏలూరురోడ్డు నుండి నెహ్రూచౌక్ వరకు మరియ్యమాత స్వరూపని ఊరేగించడం జరుగుతుందన్నారు. క్రైస్తవ విశ్వాసులు, తదితరులు ఈ ఊరేగింపులో పాల్గొని మరియతల్లి దీవెనలు పొందలన్నారు.

యువతికి కాకాని బాబు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-హనుమాన్ జంక్షన్ : అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక కిరాణా వ్యాపారి అంత్యం గుప్త కుమార్తె తనుజకు వైద్యం నిమిత్తం స్థానిక ప్రముఖులు కాకాని బాబు రూ.50వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. ప్రస్తుతం ఆమె హైదరాబాద్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుంది. ఆల్ ఇండియా ఆర్యవైశ్య మహాసభ ఎగ్జిక్యూటివ్ మెంబర్ పైడి సుధాకర్ ఆధ్వర్యంలో బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం యువతి బంధువు అంత్యం రాజాకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు బాబును అభినందించారు.

వ్యవసాయానికి రోజూ 9 గంటల విద్యుత్ ఇవ్వాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : వ్యవసాయానికి రైతులకు రోజూ 9 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని జనసేన, టిడిపి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్ ఎ.ఇ. కార్యాలయం వద్ద టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు ఆధ్వర్యంలో నిరసన తెలియచేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి విద్యుత్ శాఖ సహాయక ఇంజనీర్‌కు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని అందచేశారు. నియోజకవర్గంలోని కాలువ చివరి భూములకు ఇప్పటికే సాగునీరు అందక రైతులు అల్లాడుతుంటే రోజుకి 9 గంటల నిరంతర విద్యుత్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు దారుణం అని పార్టీ నేతలు అన్నారు. గడిచిన 15 రోజుల నుండి నియోజకవర్గంలో వ్యవసాయానికి 7 గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తున్నారని అదికూడా నిరంతరాయంగా కాకుండా పలు మార్లు ఇవ్వడం కారణంగా విద్యుత్ మోటార్లు కాలిపోయి రైతులు తీవ్ర నైరాశ్యంలో ఉన్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. దివిసీమలో వరి పంట ప్రస్తుతం పొట్టదశలో ఉందని ఈ సమయంలో సాగు నీరు బాగా అవసరం అని నీరు అందకపోతే పంట దిగుబడులు బారీగా తగ్గిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి రైతులకు రోజుకి 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, చేయకపోతే దివిసీమలోని రైతుల పక్షాన ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ జిల్లా ఎస్.సి సెల్ అధ్యక్షులు ఎం ఆదినారాయణ, బచ్చు మురళికృష్ణ, బచ్చు శ్రీనివాసరావు, పంచాయితీ వార్డు సభ్యులు, కమ్మిలి సాయి భార్గవ, తుంగల వేణు, రైతులు వీరమహిళలు, జనసేన, టిడిపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సామాజిక సాధికారిత యాత్ర పేరు మార్చాలి- దోవా గోవర్ధన్

విశాలాంధ్ర-అవనిగడ్డ : సామాజిక సాధికారిత యాత్ర పేరు మార్చాలని జిల్లా మాల మహానాడు నేత దోవా గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఇది రెడ్డి సామాజిక యాత్ర కానీ బలహీన వర్గాలది కాదని, బలహీన వర్గాలను అనేక విధాలుగా మోసం చేసి అవమానించి దళితులను చంపిన వాళ్ళకు ఉన్నత పదవులు ఇస్తూ సామాజిక యాత్ర అనడం సిగ్గుచేటని దోవా అన్నారు. డాక్టర్ సుధాకర్ సస్పెంక్షన్, ఎం.ఎల్.సి డ్రైవర్ శ్యామ్ బాబు హత్య, కోడి కత్తి శ్రీను కేసు విషయంలో ప్రభుత్వం నైతికత ఏంటో అర్థం అయ్యిందని అన్నారు. సోమవారం దోవా గోవర్ధన్ విలేకరులతో మాట్లాడుతూ సామాజిక న్యాయం అంటే విభిన్న జాతులను ఐక్యపరతతతచడం, అభివృద్ధి చేయడం గొప్ప సంస్కరణలు తేవడాన్ని సామాజిక న్యాయం అంటారని ఆ విధంగా ఈ ప్రభుత్వంలో ఏమీ జరగలేదని గోవర్ధన్ అన్నారు. బిసి లకు వేరు వేరుగా 56 కార్పొరేషన్లు ఇచ్చి వారి ఐక్యతలను విడతీయడం సామాజిక న్యాయమా అని ప్రశ్నించారు. ఇక ఎస్.సి., ఎస్.టి లను, మాల, మాదిగ, రెల్లి అంటూ అనేక కార్పొరేషన్లు పెట్టి ఆర్టికల్ 9 పై గొడ్డలి వేటు వేసారని, పోనీ ఇన్ని కార్పొరేషన్లు కొత్తగా తెచ్చినా మీరు ఆ కార్పొరేషన్లకు ఎంత వరకు నిధులు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. 85 శాతం ప్రజలకు 60 కార్పొరేషన్లు పెట్టి ఆ చైర్మన్లకు కనీసం ఒక కార్యాలయం దానిలో ఒక కుర్చీ కూడా ఇవ్వకుండానే వారి పదవీకాలం ముగిసింది అంటే వారికి అది ఎంత తీరని అవమానమో, ద్రోహమో అని ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రామీణస్థాయిలో సేవల విస్తరణకు సచివాలయ వ్యవస్థ

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: గ్రామీణ స్థాయిలో ప్రభుత్వ సేవలను విస్తరించి, ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిందని తిరువూరు శాసనసభ్యుడు కె.రక్షణనిధి అన్నారు. మండలంలోని కొర్లమండ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్ర భవనాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి సొంత గ్రామంలోనే సంక్షేమం అందుబాటులోకి రావాలనే లక్ష్యంతోనే వీటిని ప్రతి చోటా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలు, విద్య, ఆరోగ్యసేవలను గ్రామస్థాయిలో చేరువ చేస్తామని ఈ సందర్భంగా ఆయన వివరించారు. కార్యక్రమంలో తహశీల్దారు చంద్రశేఖర్, ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి, ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, జడ్పీటీసీ సభ్యుడు బీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

స్కౌట్స్& గైడ్స్ చేస్తున్న సేవలు వెలకట్టలేనివి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రజలకు చేసే సేవ భగవంతుని సేవ ముఖ్యంగా అత్యవసర సమయాల్లో స్కౌట్స్ & గైడ్స్ పాల్గొని చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎస్సీ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్,ఎస్సీ రైల్వే స్టేట్ భారత్ స్కౌట్స్ & గైడ్స్ చీఫ్ కమీషనర్ పి.కిషోర్ బాబు కొనియాడారు.సౌత్ సెంట్రల్ రైల్వే స్టేట్ భారత్ స్కౌట్స్& గైడ్స్ 18వ జిల్లా ర్యాలీ సోమవారం రైల్వే మినీ స్టేడియంలో నిర్వహించారు. ముఖ్య అతిదిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ & గైడ్స్ వారి దాతృత్వ కార్యకలాపాలను కొనియాడారు.మానవాళికి చేసే సేవ భగవంతుని సేవగా పేర్కొన్నారు. ఎమర్జెన్సీ, రెస్క్యూ ఇతర ఊహించలేని పరిస్థితుల్లో స్కౌట్స్& గైడ్స్ కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఇలాంటి ర్యాలీలు శిబిరాలు యువతలోని అత్యద్భుతమైన నైపుణ్యాలను, ప్రతిభను పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. ప్రతి సందర్భంలోనూ తమ సత్తా చాటాలని విజ్ఞప్తి చేశారు. ఫూల్ ప్రూఫ్ ఏర్పాట్లను చేసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు విజయవాడ డివిజన్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ వేడుకలు విజయవాడలో మూడు రోజుల పాటు జరుగుతాయి.18వ జిల్లా ర్యాలీలో మొత్తం 19 జట్లు, విజయవాడ నుండి 12, మిగిలినవి హైదరాబాద్, గుంటూరు, సికింద్రాబాద్, నాందేడ్, గుంతకల్ రైల్వే డివిజన్‌ల నుండి, జంట తెలుగు రాష్ట్రాల నుండి 2 జట్లు పాల్గొన్నాయి.42 టెంట్లు వేయగా విద్యార్థులు, వాలంటీర్లు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ మూడు రోజులలో, జిల్లా ర్యాలీ శిబిరంలో గృహనిర్మాణం, వక్తృత్వం, సాంస్కృతిక, ప్రథమ చికిత్స అత్యవసర,రెస్క్యూ కార్యకలాపాలు వంటి 32 పోటీలు జరుగుతాయి. ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తారు.ఏడిఆర్ఎమ్ డి.శ్రీనివాసరావు,సీనియర్ డిపిఓ ఎం. బాల మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-కూచిపూడి : ప్రజాస్వామ్య పరిరక్షణ, లౌకికవాదం, అసమానతలు లేని అభివృద్ధి కోసం నవంబర్ 15 నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొనివిజయవంతం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా సభ్యులు శీలం నారాయణరావు పిలుపునిచ్చారు ఈ. మండల కేంద్రమైన మొవ్వలో సోమవారం దీనికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. రాష్ట్ర భవిష్యత్తును సక్రమ మార్గం లో నడిపించడానికి ప్రజలందరూ ఐకమత్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని ,ఈ ఉద్యమంలో తాము కూడా ప్రజల అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈనేపధ్యంలో కేంద్రంలో బిజెపి పార్టీని తరిమి కొట్టటానికి తాము చేస్తున్న ఉద్యమంలో భాగంగా చలో విజయవాడ కార్యక్రమానికి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కాకి రాజశేఖర్, కొడాలి శ్రీనివాసరావు, సప్పిడిలాజర్, లతోపాటు ప్రజాసంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.

వరల్డ్ స్ట్రోక్ డే ప్రత్యేక కార్యక్రమాలు

- హెల్ప్ లైన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మన్ డాక్టర్ జి. రమేష్ పిలుపు

- అను ఇనిస్టిట్యూట్ స్ట్రోక్ హెల్ప్ లైన్ నంబర్ 9542108108

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా అను ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూరో అండ్ కార్డియాక్ సైన్సెస్ వారు ఓ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పక్షవాతంగా పిలువబడే బ్రెయిన్ స్ట్రోక్ బారినపడినవారికి తక్షణ వైద్య సేవలందించేందుకు గాను.. ప్రత్యేక హెల్ప్ లైన్ 9542108108 నెంబరుతో పాటు, స్ట్రోక్ కేర్ ఆన్ వీల్స్ పేరుతో పక్షవాత చికిత్సా వాహనాన్ని ఆవిష్కరించారు. ఈ స్ట్రోక్ హెల్ప్ లైన్ సేవలను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. ఎనికేపాడులోని అను ఇనిస్టిట్యూట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మల్లాది విష్ణు మాట్లాడుతూ, స్ట్రోక్ కారణంగా అనేక మంది శాశ్వత అంగవైకల్యానికి గురై, వారి కుటుంబాలు ఛిద్రమవుతున్నాయని తెలిపారు.. స్ట్రోక్ బారినపడినవారికి సత్వర చికిత్స అందించడం కోసం హెల్ప్ లైన్ సేవలను అందుబాటులోకి తేవడం అభినందనీయమని అన్నారు. అను ఇనిస్టిట్యూట్ చేపట్టిన ఈ కార్యక్రమం స్ట్రోక్ బారినపడినవారికి సంజీవనిలా ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ గాజుల రమేష్ మాట్లాడుతూ, "స్ట్రోక్ అంటే మెదడుకు వచ్చే పోటు. దీనినే సాధారణ భాషలో పక్షవాతం అంటారు. బ్రెయిన్ స్ట్రోక్‌పై చాలా మందికి సరైన అవగాహన లేదు. కాళ్లు, చేతులు పడిపోతేనో, మూతి వంకరపోయిన తర్వాత మాత్రమే వైద్యుల వద్దకు వెళ్తున్నారు. దీర్ఘకాలిక జబ్బులైన బీపీ, షుగర్ కంట్రోల్‌లో లేకపోవడం, మద్యపానం, ధూమపానం అతిగా సేవించడం, స్థూలకాయం కారణంగా ఒంట్లో కొవ్వుస్థాయిలు పెరిగిపోవడం, గుండెజబ్బులకు మందులు సరిగ్గా వాడకపోవడం వంటివి స్ట్రోక్‌కు దారి తీస్తాయన్నారు. అను ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్ట్రోక్ హెల్ప్ లైన్ 9542108108 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ జి. రమేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దేవినేని అవినాష్, అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్లు డాక్టర్ విశ్వేశ్వరరావు, డాక్టర్ దుర్గానాగరాజు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రవికుమార్, న్యూరో సర్జన్ డాక్టర్ తీగల రమేష్, న్యూరాలజిస్ట్ డాక్టర్ సౌమ్య మేదరమెట్ల, న్యూరో సర్జన్ డాక్టర్ సాయికృష్ణ, ఇంటర్వెన్షనల్ న్యూరాలజిస్ట్ డాక్టర్ సయ్యద్ జాఫర్ పాల్గొన్నారు.